సాక్షి
రాజన్న సిరిసిల్ల

గురువారం । 9 । నవంబర్ । 2023

మీకు తెలుసా?

పదహారు భాషల్లో ఓటరు జాబితా



కరీంనగర్ అర్బన్: ఓటరు జాబితా 16 భాషల్లో ముద్రిస్తారు. ఏదైనా అసెంబ్లీ నియోజకవర్గంలో నమోదైన ఓటర్లలో 20శాతం మందికి పైగా అధికార భాష కాకుండా మరేదైనా భాష మాట్లాడుతూ ఉండి ఆ మైనార్టీ భాషలో అక్షరాస్యుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పుడు వారి భాషలోనూ జాబితాను ప్రచురించి ప్రకటించాలని ఎన్నికల సంఘం ఆదేశిస్తుంది. ఇలాంటి సందర్భాల్లో బ్యాలెట్ కూడా విభిన్న భాష ల్లో ముద్రిస్తారు. దీనికి తోడు అన్ని మెట్రో నగరాల్లో ఓటరు జాబితాలను ఆంగ్లంలో సైతం ప్రచురిస్తారు. సర్వీసు ఓటర్ల జాబితాలో చివరి భాగం తప్పనిసరిగా ఆంగ్లంలోనే ఉంటుంది. ప్రస్తుతం దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఆంగ్లం తోపాటు 16 భాషల్లో ఓటర్ల జాబితాను ప్రచురిస్తున్నారు.

నామినేషన్ల వివరాలు.. 5వ రోజు

నియోజకవర్గం	నామినేషన్లు	సెట్లు
సిరిసిల్ల	4	4
వేములవాడ	3	3

NOMINATIONS!

‘అసెంబ్లీ’ వేదికన.. ఎడారి వేదన!

జంగ్ తెలంగాణ

- ఉమ్మడి జిల్లాలో 3.71 లక్షల వలసజీవుల ఓట్లు
- ఎన్నికల బరిలో గల్ఫ్ వాపసీలు
- నామినేషన్లకు సిద్ధమవుతున్న ఎన్నారైలు
- ఇప్పటికే ఇద్దరి నామినేషన్.. రెడీగా మరో ముగ్గురు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

ఒకప్పుడు తెలంగాణ రాష్ట్రంలో అందులోనూ ఉత్తర జిల్లాలైన నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో కరువు తాండవించేది. అందుకే, ఇక్కడి యువత గల్ఫ్ వలసలకు మొగ్గు చూపేవారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక వలసలు తగ్గినా.. గల్ఫ్‌లో చక్కటి ఉపాధి కోసం వెళ్లే యువతలో ఆసక్తి మాత్రం తగ్గడం లేదు. ఈ క్రమంలో ఎడారి దేశాల్లో ఆకస్మిక మరణాలు, మరణించిన వారికి బీమా పరిహారం, అనారోగ్యం, తిరిగి వచ్చిన వారికి పునరావాసం, వ్యాపార సబ్సిడీలు, రాయితీలు వంటి వాటి కోసం ఒక విధానం ఉండాలని చాలాకాలంగా పోరాటాలు సాగుతున్నాయి. ఈసారి అసెంబ్లీ ఎన్నికలను తమ డిమాండ్ల సాధనకు వేదికగా ఎంచుకున్నారు. ఎన్నికల సాక్షిగా తాము బరిలో నిలిచి, తమ సాధకబాధకాలను లోకానికి తెలియజేస్తే.. కనీసం ఈ దఫా ప్రభుత్వంలోనైనా తమ బతుకులకు భరోసా దక్కుతుందన్న ఆశతో ఉన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో దాదాపు 3.71 లక్షల గల్ఫ్ కుటుంబాల ఓట్లు ఉన్నాయి. వీరందరినీ ఏక తాటిపై తీసుకువచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి.


15 లక్షల మంది వరకు గల్ఫ్ వాపసీలు

గల్ఫ్ దేశాల్లో మన రాష్ట్ర కూలీలు 15 లక్షల మంది వరకు ఉంటారని అంచనా. గత పదేళ్లలో ఎడారి దేశాల నుంచి మరో 15 లక్షల మంది వాపస్ వచ్చి, స్వగ్రామాల్లో సరైన ఉపాధి లేక ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. స్థానిక వనరులతో పరిశ్రమలు ఏర్పాటు, వ్యవసాయ రంగానికి మద్దతు ఇస్తే వలస సమస్యలు కొంతవరకు తీరుతాయని వారి వాదన. రాష్ట్రంలో మొత్తం 32 అసెంబ్లీ నియోజకవర్గాల్లో తమ కుటుంబాల ఓట్లు నిర్ణయాత్మకంగా మారతాయని ధీమాగా ఉన్నారు. అందుకే, వీరిలో రాజకీయ చైతన్యం రగిలించాలని, తద్వారా అనుకున్న డిమాండ్లు నెరవేర్చుకునేలా పలువురు గల్ఫ్ ఉద్యమకారులు ప్రణాళికలు రచిస్తున్నారు.

నామినేషన్ల ద్వారా నిరసన

గల్ఫ్ కార్మికుల సమస్యలను, న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేయాలని, వారిపై సానుభూతి ఉన్న ఓటర్లను తమవైపు తిప్పుకోవాలన్నది గల్ఫ్ ఉద్యమకారుల వ్యూహం. ఈ అసెంబ్లీ ఎన్నికలను వేదికగా చేసుకొని, నామినేషన్లు వేయాలని నిర్ణయించారు. ఇప్పటికే ఇద్దరు నామినేషన్ వేయగా మరో మహిళ గురువారం ధర్మపురిలో వేసేందుకు సిద్ధమవుతున్నారు.

ప్రవాసీ పాలసీయే అ‘జెండా’



నామినేషన్లు వేసేది వీరే..


1. వేములవాడ: గుగ్గిళ్ల రవిగౌడ్
2. నిర్మల్: స్వదేశ్ పరికిపండ్ల
3. కోరుట్ల: చెన్నమనేని శ్రీనివాసరావు
4. సిరిసిల్ల: కృష్ణ దొంతికెంటి
5. ధర్మపురి: బూత్కురి కాంత

నోట్: వీరిలో వేములవాడ, నిర్మల్‌లో నామినేషన్ వేశారు. కోరుట్ల, సిరిసిల్ల, ధర్మపురిలో వేయాల్సి ఉంది.

సోషల్ మీడియా అస్త్రంగా..

గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రవాసులు ఈసారి రాష్ట్రంలోని గల్ఫ్ ఎన్నారైలు ఉండే 32 నియోజకవర్గాలను ప్రభావితం చేయాలనుకుంటున్నారు. ఇందుకోసం సోషల్ మీడియాను అస్త్రంగా ఎంచుకున్నారు. వాట్సాప్, ఈఎంవో ఎఫ్‌బీ మెసెంజర్, ఇన్‌స్టా తదితర యాప్స్ ద్వారా తమ కుటుంబసభ్యులకు ఫోన్ చేసి, గల్ఫ్ సంఘాల అభ్యర్థులకు ఓట్లు వేయించాలని కోరుతున్నారు.

ఎన్ఆర్ఐ పాలసీ తేవాలి



ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లిన కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. వారి కోసం గల్ఫ్ బోర్డుతో కూడిన ప్రత్యేక ఎన్ఆర్ఐ పాలసీ తేవాలి. అక్కడ మరణించిన కుటుంబాల సంక్షేమం, తిరిగి వచ్చిన వారికి ఉపాధి, పరిశ్రమల ఏర్పాటుకు విధానం రూపొందించాలి. 32 నియోజకవర్గాల్లో గెలుపు ఓటములను ప్రభావితం చేసేలా గల్ఫ్ కుటుంబాలు ఉన్నాయి. మా గోడు ప్రభుత్వాలకు తెలిసేలా కామారెడ్డి నుంచి 100 మంది గల్ఫ్ విడోలు, నిర్మల్, బాల్కొండ, జగిత్యాల, కోరుట్ల, వేములవాడ, సిరిసిల్ల నుంచి ఒక్కో విడోతో నామినేషన్ వేయించబోతున్నాం.

– మందా భీంరెడ్డి, గల్ఫ్ వలస వ్యవహారాల విశ్లేషకులు

న్యూస్‌రీల్

దివ్యాంగులకు దీర్ఘకాలిక ప్రయోజనం

- రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ కె.వాసుదేవరెడ్డి



సిరిసిల్లలో మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి

సిరిసిల్ల: దివ్యాంగులకు దీర్ఘకాలిక ప్రయోజనం దక్కేలా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలో బుధవారం దివ్యాంగులతో సమావేశమయ్యారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, మున్సిపల్ చైర్మన్ జిందం కళాచక్రపాణి, దివ్యాంగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శీతాకాల సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ముప్పై ఏళ్లుగా పోరాడుతున్న ఎస్సీ వర్గీకరణ బిల్లును ఈ శీతకాల సమావేశాల్లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ కోరారు. హైదరాబాద్‌లో ఈనెల 11న నిర్వహించే ‘మాదిగలు–ఉపకులాల విశ్వరూప మహాసభ’ వాల్‌పోస్టర్లను బుధవారం ఎల్లారెడ్డిపేటలో ఆవిష్కరించి మాట్లాడారు.

సెస్ చైర్మన్ వాహనం తనిఖీ



చిక్కాల రామారావు వాహనం తనిఖీ చేస్తున్న పోలీసులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జిల్లా శివారు జిల్లెల్లలో పోలీసులు ప్రత్యేక చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. కాగా బుధవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. హైదరాబాద్ నుంచి సిరిసిల్ల వస్తున్న సమయంలో వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు.

ఏజీపీగా బాధ్యతలు స్వీకరించిన అంజయ్య



గంత అంజయ్య

సిరిసిల్లటౌన్: అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా గంత అంజయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఏజీపీగా ఉన్న బొంపెల్లి రవీందర్‌రావు నుంచి సీనియర్ సివిల్ జడ్జి ముందు బాధ్యతలు స్వీకరించారు. అంజయ్య ముస్తాబాద్ మండలం కొండాపూర్‌లో జన్మించారు. 2003 నుంచి న్యాయవాదిగా పనిచేస్తున్నారు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి సజ్జనం అనిల్‌తోపాటు సీనియర్ న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

జీపీ కార్మికులకు బకాయిలు చెల్లించండి



వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

సిరిసిల్లటౌన్: గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. ఈమేరకు బుధవారం కార్మికులతో కలిసి డీపీవో రవీందర్‌కు వినతిపత్రం అందించి, మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం కార్మికులకు ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలని కోరారు. ప్రాణాలొడ్డి సేవలు అందిస్తున్న కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. వెంటనే వేతనాలు మంజూరు చేయాలని కోరారు. నాయకులు మూశం రమేశ్, బుర్ర శ్రీనివాస్, లింగంపల్లి కృష్ణవేణి, లక్ష్మణ్, అంజయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కొడుకు దుబాయ్‌లో.. ఆ ఇద్దరు జైలులో..

- అనారోగ్యంతో ఉన్న భర్తను కడతేర్చిన భార్య, కూతురు
- ఫలించని శవాన్ని మాయం చేసే ప్రయత్నాలు
- మృతుని బట్టలే ప్రధాన ఆధారం
- దుర్వాసనతో దొరికిపోయారు
- పరారీలో మరో ఇద్దరు
- సంచలనం ప్రకాశ్‌రావు హత్యోదంతం



నిందితులను అరెస్ట్ చూపించిన సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్

సిరిసిల్ల: మానవత్వం మంటగలిసింది. అనుబంధాలు అడుగంటాయి. కట్టుకున్న భార్య, కన్న కూతురు కలిసి చేసిన హత్యతో ఆ కుటుంబం చిన్నాభిన్నమైంది. కొడుకు దుబాయ్‌లో.. హత్యకు పాల్పడ్డ తల్లీకూతుళ్లు జైలుపాలయ్యారు. పాతికేళ్లపాటు కాపురం చేసిన భార్య, కన్నకూతురు కలిసి తండ్రిని హత్య చేయడం తోపాటు శవాన్ని మాయం చేసేందుకు చేసిన ప్రయత్నాలు విస్తుగొలుపుతున్నాయి. ఆలస్యంగా వెలుగుచూసిన హత్యోదంతం సిరిసిల్లలో కలకలం సృష్టించింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

దుర్వాసనతో దొరికిపోయారు..

పాతిపెట్టిన శవం దుర్వాసన ఇల్లంతా వ్యాపించింది. వాకిట్లోకి దుర్వాసన వస్తుండడంతో సమీప బంధువుల సాయంతో అంత్యక్రియలు చేశారు. నిద్రలోనే చనిపోయాడని చుట్టుపక్కల వారికి చెప్పారు. వైకుంఠరథంలో శవాన్ని తీసుకెళ్తుంటే దుర్వాసన రావడంతో అనుమానం వచ్చిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే శవం కాలిపోయింది. సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్, పోలీసులు తల్లీకూతుళ్ల స్వప్న, ఉషశ్రీని అదుపులోకి తీసుకుని విచారించడంతో హత్యోదంతం వెలుగుచూసింది.



పోలీసులు స్వాధీనం చేసుకున్న మృతుడు ప్రకాశ్‌రావు రక్తం మరకల బట్టలు

గల్ఫ్ బాటలో అలసిపోయి..

సిరిసిల్లలోని గాంధీనగర్‌లో అద్దె ఇంట్లో ఉండే ప్రకాశ్‌రావు కుటుంబ పోషణకు గల్ఫ్ దేశానికి వెళ్లాడు. ప్రకాశ్‌రావు పంపిన డబ్బులతో జిల్లా కేంద్రంలోని శివనగర్‌లో ఇంటిని కొనుగోలు చేశారు. దాదాపు 15 ఏళ్లపాటు గల్ఫ్‌లో పనిచేసిన ప్రకాశ్‌రావు ఏడాది క్రితం పక్షవాతం రావడంతో ఇంటికొచ్చాడు. చేతికందిన కొడుకును గల్ఫ్ దేశానికి పంపించాడు. పక్షవాతంతో బాధపడుతూ భార్య,కూతురుతో కలిసి ఇంట్లోనే ఉంటున్నాడు.

అడ్డుతొలగించాలని..

ప్రకాశ్‌రావు గల్ఫ్‌లో ఉండగానే అతని భార్య స్వప్న(42)కు ఓ వ్యక్తితో సాన్నిహిత్యం ఏర్పడింది. అతని వద్ద భారీగా డబ్బులు తీసుకున్నట్లు సమాచారం. ఆమె చర్యలతో అప్పులపాలైన సదరు వ్యక్తి శివనగర్‌లోని ఇల్లును అమ్ముకుని హైదరాబాద్‌కు పరారయ్యాడు. మంచంపట్టిన ప్రకాశ్‌రావుతో స్వప్న తరచూ గొడవపడేది. ఆమె ప్రవర్తనను తప్పుపట్టడంతో అడ్డుతొలగించుకోవాలని భావించింది. నవంబరు 1న అర్ధరాత్రి నిద్రలో ఉన్న ప్రకాశ్‌రావు మెడను కూరగాయల కత్తితో కోయగా.. కూతురు ఉషశ్రీ(18) దిండుతో ఒత్తిపట్టింది. శవాన్ని గొడ్డలితో ముక్కలు చేయాలనుకోగా.. సాధ్యం కాలేదు. మరుసటి రోజు మటన్ కొట్టే కత్తిని కొనుగోలు చేసి ముక్కలు చేయాలని ప్రయత్నించగా వీలుకాలేదు. పెట్రోల్‌తో కాల్చివేయాలని రెండు సార్లు నిప్పు అంటించారు. మంటలు భారీగా రావడంతో చల్లార్చారు. చివరికి ఇంట్లోనే గొయ్యి తీసి శవాన్ని పూడ్చిపెట్టారు. రెండు రోజులపాటు శవంతో సహవాసం చేశారు.

గతంలోనూ జైలుకెళ్లిన స్వప్న

గతంలో సమీప బంధువు హత్య కేసులో స్వప్న జైలుకెళ్లింది. నిత్యం తెల్లవారుజామునే గుడికెళ్లి పూజలు చేసే అలవాటు ఉన్న స్వప్న ఇలా క్రూరంగా భర్తను హతమార్చడం స్థానికంగా చర్చనీయాంశమైంది. హత్య జరిగిన ఇంటిని కూడా ఓ వ్యాపారికి ఇటీవల రూ.38 లక్షలకు అమ్మేసింది. ఇల్లు రిజిస్ట్రేషన్ కూడా అయింది. ఆ డబ్బుతో సిరిసిల్ల విడిచి వెళ్లేందుకు సిద్ధమైనట్లు సమాచారం. హత్య సమయంలో ప్రకాశ్‌రావు ఒంటిపై ఉన్న బట్టలకు అంటిన రక్తం మరకలు, ఇంట్లో గొయ్యిలో పూడ్చిన చోట ఉన్న మృతుడి రక్తం మరకలు, మాంసపు ముద్దలే కేసుకు సాక్ష్యంగా మారాయి. హత్య జరిగినట్లు తెలిసినా.. దాచి ఉంచి, అంత్యక్రియలకు సహకరించిన స్వప్న చిన్నాన్న, అతని భార్య పరారీలో ఉన్నారు. ప్రకాశ్‌రావు హత్యకు గురికాగా.. అతని కొడుకు గల్ఫ్‌లో ఉన్నాడు.. భార్య, కూతురు జైలుకు వెళ్లారు. ఇంటికి తాళం పడింది. సిరిసిల్ల ప్రజలు ఈ ఘటనతో ఉలిక్కిపడ్డారు. హత్య కేసును వేగంగా చేధించిన సిరిసిల్ల టౌన్ పోలీసులు పని తీరు ప్రశంసనీయమైంది.

బలగాల కవాతు



తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలం అనంతారం, రహీంఖాన్‌పేట్, వల్లంపట్ల, ఒగులాపూర్, వెల్జిపూర్ గ్రామాల్లో బుధవారం కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఎస్సై సుధాకర్ మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రతి పౌరుడు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని దేశంలో ప్రతి ఒక్కరికి ఎన్నికల్లో పాల్గొనే అవకాశం ఉందని పేర్కొన్నారు. హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ, కానిస్టేబుళ్ల తిరుపతి, శ్రీనివాస్, మధు, లక్ష్మీనారాయణ, భానుచందర్, క్రాంతి పాల్గొన్నారు.

సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం

- కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకమని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఎన్నికల విధులు, బాధ్యతలపై 123 మంది సూక్ష్మ పరిశీలకులకు శిక్షణనిచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ గుర్తించిన పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల సంఘం నియమావళిని అతిక్రమిస్తున్నారా అనే అంశాలను పరిశీలించాలని సూచించారు. మాక్‌పోల్ నిర్వహణ, ఓటర్ల గుర్తింపు ఓటర్‌కార్డు లేదా ఎన్నికల సంఘం నిర్దేశించిన కార్డుల ప్రకారం కొనసాగుతుందా.. లేదా.. పరిశీలించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఉన్నతాధికారుల దృష్టికి, సాధారణ పరిశీలకుల దృష్టికి తేవాలన్నారు. సూక్ష్మ పరిశీలకుల నివేదికల ఆధారంగానే కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయాలు ఆధారపడి ఉంటాయని తెలిపారు. ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి పీబీ శ్రీనివాసాచారి, మాస్టర్ ట్రైనర్ పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేయాలి

ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓట్ల లెక్కింపు కేంద్రాలలో చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి సూచించారు. పోలింగ్‌కు కౌంటింగ్‌కు మధ్య సమయం తక్కువగా ఉన్నందున ఇప్పటి నుంచే ఏర్పాట్లను చేయాలన్నారు. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రం లే-అవుట్ సిద్ధం చేయడం, కమ్యూనికేషన్ ప్లాన్, కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతించడానికి గల నిబంధనలు, కౌంటింగ్ ఏజెంట్ల నియామక నిబంధనలను, అబ్జర్వర్‌లకు సంబంధించి చేసుకోవాల్సిన ఏర్పాట్లు, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఎలా చేయాలి, ఆర్వోల బాధ్యతలు, మీడియా సెంటర్ ఏర్పాట్లు, స్ట్రాంగ్‌రూమ్ ఏర్పాట్లు, భద్రత చర్యలు, వీడియోగ్రఫీ, ఫైర్‌సేఫ్టీ చర్యలపై వివరించారు. కౌంటింగ్‌హాల్‌కు ఎంట్రీ, ఎగ్జిట్ ఉండాలని, రెండు వైపులా గార్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్, ఇంటర్నెట్ సౌకర్యం, మీడియా కవరేజీ చేయాల్సిన విధానంపై కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. పంచాయతీరాజ్ ఈఈ సూర్యప్రకాశ్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి శ్రీనివాస్, డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, డీపీఆర్వో దశరథం, సిరిసిల్ల, వేములవాడ తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

ధాన్యానికి కనీస మద్దతు ధర

- పోస్టర్లను ఆవిష్కరించిన అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్

సిరిసిల్ల: రైతుల పంటకు కనీస మద్దతు ధర కల్పిస్తున్నామని జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ప్రభుత్వం రూపొందించిన ప్రచార పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలం వరి ధాన్యాన్ని పూర్తి స్థాయిలో రైతుల నుంచి కొనుగోలు చేస్తామన్నారు. జిల్లాలో 258 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించిన పంటను జిల్లా అధికారులు ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే మద్దతు ధర వస్తుందని తెలిపారు. డీఆర్‌డీవో నక్క శ్రీనివాస్, డీఎస్‌వో ఎస్.జితేందర్‌రెడ్డి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ జితేంద్రప్రసాద్, డీసీవో బుద్ధనాయుడు, ఏపీవో పాపారావు పాల్గొన్నారు.

ఏడు నామినేషన్లు

- సిరిసిల్లలో నాలుగు.. వేములవాడలో మూడు

సిరిసిల్ల/వేములవాడ: జిల్లా వ్యాప్తంగా బుధవారం ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. సిరిసిల్ల నియోజకవర్గంలో నాలుగు, వేములవాడ నియోజకవర్గంలో మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. సిరిసిల్లలో.. కాంగ్రెస్ అభ్యర్థి కె.కె.మహేందర్‌రెడ్డి తరఫున ఆ పార్టీ నాయకులు కాముని వనిత, మడుపు శ్రీదేవి, ఆకునూరి బాలరాజు, వైద్యశివప్రసాద్, మ్యాన ప్రసాద్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.ఆనంద్‌కుమార్‌కు నామినేషన్ పత్రాన్ని అందించారు. బీజేపీ అభ్యర్థి రాణీరుద్రమారెడ్డి తరఫున ఆ పార్టీ నాయకులు ఆడెపు రవీందర్, బొల్గం నాగరాజు, గూడూరి భాస్కర్, చీటి కమలాకర్‌రావు నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా లగిశెట్టి శ్రీనివాస్, తాటిపాముల శ్రీనివాస్ నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థి లగిశెట్టి శ్రీనివాస్ నామినేషన్ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ తీశారు. సిరిసిల్లలో ఇప్పటి వరకు మొత్తం ఆరుగురు అభ్యర్థులు ఏడు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల దాఖలుకు శుక్రవారం చివరి రోజు కావడంతో మరిన్ని నామినేషన్లు వచ్చే అవకాశం ఉంది. వేములవాడ అసెంబ్లీ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా మహమ్మద్ నజీర్, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా గడ్డం హరీశ్, బీజేపీ అభ్యర్థిగా తుల ఉమ తరఫున మహమ్మద్ ఇక్బాల్ నామినేషన్‌లు దాఖలు చేశారు.

క్లుప్తంగా

ప్రధాని మోదీని కలిసిన గౌడ వాసు



ప్రధాని నరేంద్రమోదీకి నమస్కరిస్తున్న గౌడ వాసు

సిరిసిల్ల: ప్రధాని నరేంద్రమోదీని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి, సిరిసిల్లకు చెందిన గౌడ వాసు బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. భారత ప్రధానిని ఇలా కలువడం ఎంతో ఆనందాన్నిచ్చిందని తెలిపారు. మెగా టెక్స్‌టైల్ పార్క్ తెలంగాణకు కేటాయించడం, బీసీ అభ్యర్థిని సీఎంగా ప్రకటించడంపై ఈ సందర్భంగా మోదీకి కృతజ్ఞతలు తెలిపినట్లు గౌడ వాసు వివరించారు.

అక్రమ మద్యం సీజ్



మద్యం సీజ్ చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఎన్నికల నియామవళి అమలులో ఉన్నప్పుడు మద్యం అక్రమంగా నిల్వ ఉంచడం, రవాణా చేయడం, విక్రయించడం చట్ట విరుద్ధమని ఎక్సైజ్ సీఐ గులాం ముస్తఫా పేర్కొన్నారు. తంగళ్లపల్లి మండలం చిన్నలింగాపూర్‌లో బుధవారం వాహనాల తనిఖీ చేపడుతుండగా అక్రమంగా మద్యం తరలిస్తున్న పెద్దలింగాపూర్‌కు చెందిన దర్శనం రాములు, బండారి లింగంలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.7వేల విలువైన మద్యాన్ని సీజ్ చేశారు. తనిఖీలలో ఎక్సైజ్ ఎస్సైలు శేఖర్, రాజేందర్, సిబ్బంది శ్రీనివాస్, నరేందర్, జి.శ్రీనివాస్, మధు, రూప, అనూష పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో శిశువు మృతి

- వైద్యులతో కుటుంబ సభ్యులు, బంధువుల వాగ్వాదం

కోల్‌సిటీ(రామగుండం): ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యంతోనే శిశువు మృతి చెందిందని కుటుంబ సభ్యులు, బంధువులు జీజీహెచ్ ఆస్పత్రిలో ఆందోళన నిర్వహించారు. రామగుండంకు చెందిన తొమ్మిది నెలల గర్భిణీ ఈనెల 1న గోదావరిఖనిలోని జీజీహెచ్ ఆస్పత్రిలో చేరగా 3న వైద్యులు డిశ్చార్జి చేశారు. మళ్లీ 5న మరోసారి చెకప్ కోసం రాగా పరీక్షలు నిర్వహించి ఇంటికి పంపించారు. ఈనెల 9న డెలివరీ చేస్తామని వైద్యులు తెలపగా బుధవారం ఆమె వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి వచ్చింది. అన్ని పరీక్షలు నిర్వహించిన వైద్యులు కడుపులో శిశువు మృతిచెందిందని తెలిపారు. అనంతరం ఆపరేషన్ చేసి శిశువును బయటకు తీశారు. అయితే ఈనెల 5న బెడ్లు ఖాళీగా లేవంటూ నిర్లక్ష్యంగా ఇంటికి పంపించారని, అప్పుడే అడ్మిట్ చేసుకొని వైద్యం అందిస్తే శిశువు చనిపోయేది కాదని, దీనికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యులు, బంధువులు వాగ్వాదానికి దిగారు. విషయం తెలిసిన వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు బాధితులతో మాట్లాడారు. ఈ విషయమై ఆర్ఎంవో అరుణను వివరణ కోరగా ఇందులో వైద్యుల నిర్లక్ష్యం లేదన్నారు.

సమర్థవంతమైన నాయకునికే ఓటు

- ప్రలోభాలకు లొంగకూడదు
- అబద్ధాల నేతకు ఓటు బంద్
- యువత మనోగతం

ఓటర్స్ ఎజెండా



జగిత్యాల: రాజ్యాంగం కల్పించిన హక్కు ఓటు. ఈ హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకుంటేనే మెరుగైన సమాజం ఆవిర్భవిస్తుంది. 18 ఏళ్లు నిండిన యువతలో అవగాహన కల్పించిన అధికారులు.. ప్రతి ఒక్కరినీ ఓటరు నమోదు చేశారు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో యువత ఓట్లు అధికంగానే నమోదయ్యాయి. ఈ క్రమంలో కొందరిని 'సాక్షి' పలుకరించి వారి మనోగతాన్ని తెలుసుకుంది. సమర్థవంతమైన నాయకుడినే ఎన్నుకోవాలని, నేతల అబద్ధాలు విని ఓటు వేస్తే ఇబ్బందులు తప్పవని, మంచి నాయకుడితోనే సుపరిపాలన సాధ్యమని వెల్లడించారు. అదే యువత భవిష్యత్‌కు భరోసా కల్పిస్తుందని తెలిపారు. ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకుంటామని చెప్పారు.

ఉచిత పథకాలొద్దు.. ఉద్యోగాలివ్వాలి



యువతకు ఉద్యోగాలు ఎంతో అవసరం. ఉచిత పథకాలు తీసేసి పేదలకు మెరుగైన వైద్యం, విద్య అందించాలి. రిజర్వేషన్లు, కులాలను బట్టి కాకుండా వారి ఆదాయం చూసి ఇవ్వాలి. రిజర్వేషన్లతో కొందరికి ఉద్యోగాలు వస్తుండగా ప్రతిభ ఉన్నా ప్రయోజనం లేకుండా పోతోంది. సమర్థవంతమైన నేతను ఎన్నుకోవాలి.

– హర్షవర్ధన్, జగిత్యాల

ఓటు మార్పునకు నాంది కావాలి



ప్రజా సంక్షేమంతో పాటు, అభివృద్ధికి పాటుపడే నాయకుడికే ఓటు వేస్తా. ఓటు వజ్రాయుధం. అర్హులైన వారందరు ఓటుహక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తా. ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా అభివృద్ధి చేసే యువ నాయకులను ప్రోత్సహించాలి. అప్పుడే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుంది.

– ఆత్మకూరి గణేశ్, జగిత్యాల

నిరుద్యోగులుగానే



ప్రస్తుతం దేశంలో యువత ఎక్కువ శాతం ఉన్నారు. ఎంతోమంది ఉద్యోగాలు లేక నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. విద్యాభివృద్ధిపై మార్పు తీసుకువచ్చే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకురావాలి. నిరంతరం విద్యార్థుల సమస్యల సాధన కోసం పాటుపడే నాయకుడిని ఎన్నుకోవాలి.

– రోషిని, జగిత్యాల

ప్రజల్లో చైతన్యం తేవాలి



యువతీ, యువకులు తమ భవిష్యత్ కోసం ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి. అప్పుడే అభివృద్ధి జరుగుతుంది. ఎన్నికల సమయంలోనే హామీలిచ్చి కనిపించని నాయకులను చట్టసభల్లో అడుగు పెట్టనివ్వొద్దు.

– కొత్రి జ్యోత్స్న, జగిత్యాల

ఆలోచించి వేయాలి



ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ఎన్నో హామీలిస్తున్నాయి. ఆచరణలో అవి నెరవేరుతాయా లేదా అని ఆలోచించి ఓటు వేయాలి. ఒకసారి ఓటు వేస్తే ఐదేళ్ల వరకు ఏమీ చేయలేం. ఓట్లకోసం హామీలివ్వగానే నమ్మొద్దు.

– కందుకూరి సాహిత్య, జగిత్యాల

మార్పు రావాలి



అంకితభావంతో పనిచేసే వ్యక్తికే పట్టం కట్టాలి. అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది. పాలకులు తమస్వార్థం కోసం కాకుండా ప్రజా సమస్యలు, విద్య, వైద్యం అందించేందకు ఆలోచించాలి. యువత తమ ఓటుహక్కును వినియోగించుకోవాలి.

– మదీహ నిసంత్, జగిత్యాల

సమర్థవంతుడినే ఎన్నుకోవాలి



అసెంబ్లీలో విద్యార్థుల కోసం గళమెత్తే నాయకుడిని ఎన్నుకోవాలి. ఎన్నికల్లో యువత సమర్థవంతుడికే ఓటువేయాలి. దేశ భవిష్యత్ అంతా విద్యార్థులు, యువతపైనే ఆధారపడి ఉంది.

– వంశీ, జగిత్యాల

ప్రలోభాలకు లొంగొద్దు



ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగకూడదు. ప్రతిఒక్కరూ ఓటువేసే ముందు ఆలోచించి వేస్తే ఓటు దుర్వినియోగం కాదు. ఒకవేళ ప్రలోభాలకు లొంగి ఓటువేస్తే ఐదేళ్ల పాటు ఇబ్బంది పడే అవకాశం ఉంది. ప్రతి ఒక్కరూ ఆలోచించి ఓటువేయాలి. .

– గుంట శృతిక, జగిత్యాల

దూకేస్తా.. దూకేస్తా

- నేను ఎందుకు బతకాలి
- గోడ మీద పిల్లి గోల



సిరిసిల్ల: అప్పుడే తెల్లారింది.. మంచుతెరలు ఇంకా పోలేదు. కూరగాయల మార్కెట్లో రైతులు.. వ్యాపారుల హడావుడి కొనసాగుతోంది. వచ్చేవాళ్లు పోయేవాళ్లతో వీధులు సందడిగా మారాయి. నీళ్ల ట్యాంక్‌పై నుంచి పిల్లి కిందకు దూకేందుకు సిద్ధమైంది. దాన్ని చూసిన ఆటోవాలా మహేశ్... పిల్లి కిందకు దూకితే సచ్చిపోతుంది.... ష్.. ష్.. అంటూ... ఎందుకు దూకుతున్నావని? ప్రశ్నించాడు. పిల్లి ఏం మాట్లాడకుండానే మౌనంగా కిందకు దూకేందుకు ఒక్క అడుగు ముందుకేసింది. అరవై అడుగుల ఎత్తున్న నీళ్ల ట్యాంక్ పై నుంచి దూకితే ఎట్లా బతుకుతావు అంటూ మహేశ్ ప్రశ్నించాడు. అతని వైపు జాలిగా చూస్తూ నేను ఎందుకు బతకాలి.. ఎవరి కోసం దిగాలి.. నా బాధను ఆ దేవుడికి చెప్పుకుందామని పైలోకానికి వెళ్తున్నానంటూ సెలవిచ్చింది పిల్లి. అయ్యో.. నీకు బాధలేంటి.. నీ బాధేందో చెప్పు.. వీలైతే ఈ పూటకు చికెన్ బిర్యాని పెట్టిస్తా. కాదంటే పాలకోవా కొనిస్తా.. నీకేం కావాలో చెప్పు అని మళ్లీ అడిగాడు మహేశ్. నాది ఆకలి బాధ కాదు. ఏ ఇంట్లో దూరినా పాలు, పెరుగుతో నా కడుపు నిండిపోతుంది. ఓ పూట పస్తులున్నా ఏం కాదు. కానీ ఈ రాజకీయ నాయకులు మా జాతిని అవమానిస్తున్నారు. మా పిల్లి జాతి కోసం నేను ప్రాణత్యాగానికి సిద్ధపడ్డానంటూ గంభీరంగా చెప్పింది. పిల్లి మాటలు విన్న మహేశ్‌కు నవ్వొచ్చింది. ముసిముసిగా నవ్వుతూ.. ఏయ్ పిల్లి మా రాజకీయాలకు నీకేంటి సంబంధం.. అని ఆశ్చర్యంగా అడిగాడు. మీ నాయకులు ఆశించిన పార్టీ నుంచి టికెట్ రాకుంటే పార్టీలు మారడం పరిపాటి. ఇలాంటి సందర్భాల్లోనే ×గోడమీద పిల్లి₹ అంటూ మా జాతిని మీ రాజకీయ నాయకులు అవమానిస్తున్నారు. మీ నేతలు తమ చేష్టలతో మా జాతిని బాధిస్తున్నారు.. అని పిల్లి వాపోయింది. మరీ మీ పిల్లులకు గోడలు దూకడం.. కిటికిలోంచి దూరడం అలవాటే కదా అన్నాడు మహేశ్. పిల్లి మ్యావ్.. మ్యావ్.. అంటూ కోపానికొచ్చింది. మేం పొట్ట తిప్పలకే గోడలు దూకి.. కిటికీల్లోంచి దూరుతున్నాం. కానీ.. మీ నాయకులు అధికారం కోసం నైతిక విలువలను పక్కనబెట్టి ఆస్తులు కూడబెట్టేందుకు అర్రులు చాస్తున్నారు.. విలువలు మరిచి.. జెండాలు మార్చుతున్నారు.. నిన్నటి వరకు తిట్టుకున్న వారు ఎన్నికలు రాగానే కలిసిపోతున్నారు.. అలాంటి వారితో మమ్మల్ని పోల్చడం ఎంతవరకు సమంజసం అంటూ పిల్లి గాండ్రించింది. అవును నిజమే కానీ.. నువ్వు దిగిరా.. నీ సమస్యను పది మందిలో చర్చిద్దాం.. రా అని పిలిచాడు మహేశ్. లేదు.. లేదు నేను రాను, నా ఆత్మహత్యతోనైనా మీ రాజకీయ నాయకులు కాస్తయినా మారుతారని నా ఆశ. నేను వెళ్లాక ఆ దేవుడితో గోడు వెళ్లబోసుకుంట. దేవుడైనా మీ నేతలకు మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరుకుంట... అంటూ మరో రెండు అడుగులు ముందుకేసింది. నువ్వు సస్తే ఏం లాభం ఉండి సాధించాలి. నువ్వేం కోరుకుంటున్నావో అందరికీ వినొచ్చాలే గట్టిగా చెప్పు అన్నాడు మహేశ్. వినేవాళ్లు వింటారు.. మారేవారు మారుతారు.. అప్పటికే నీళ్ల ట్యాంకు వద్ద వందలాది మంది చేరారు. అక్కడ సందడిగా మారింది. దూకొద్దు.. దూకొద్దు అని జనం అరుస్తున్నారు. కానీ పిల్లి ఆ అరుపులను పట్టించుకోకుండా గట్టిగా చెప్పడం మొదలెట్టింది... గోడ దూకే వాళ్లను మీరందరూ ఎందుకు ఆమోదిస్తున్నారు.. ప్రలోభాలకు గురి కాకుండా సమర్థులకు ఎందుకు ఓటు వేయడం లేదు. అవకాశవాద రాజకీయాలను ఎందుకు ప్రోత్సహిస్తున్నారంటూ అరిచింది పిల్లి. కులం, వర్గం, ప్రాంతం ఇలా అవకాశాన్ని బట్టి మేం ఓట్లేస్తాం.. అంటూ ట్యాంకు కింద ఉన్నవాళ్ల సమాధానమిచ్చారు.నిజమే మీకన్నీ అడ్డొస్తాయి. మంచి చేసేటోళ్లను మర్చిపోతారు.. అందుబాటులో ఉండేవారిని పట్టించుకోరు.. పైసలిచ్చినోళ్లకు ఓట్లేస్తరు.. ఎన్నికల హామీలను మరిచినా ఫరవాలేదు.. మాట తప్పినోళ్లను మళ్లీ.. మళ్లీ గెలిపిస్తరు.. ఇది మనిషి నీతి... అంటూ పిల్లి గట్టిగానే అరుస్తూ చెబుతోంది. నేను చెప్పేది ఒక్కటే. పార్టీలు మారేవాళ్లను మీరు ఏమైన అనుండ్రి. కానీ గోడ మీద పిల్లి అని మా జాతితో పోల్చొద్దు. సమర్థులకు పట్టం కడితే సమాజం బాగుపడుతుంది. మీ పిల్లలకు ఉద్యోగాలొస్తాయి. మీ బీడు భూములకు నీళ్లొస్తాయి. చిత్తశుద్ధి, నైతిక విలువలతో పనిచేసే నాయకులకు ఓటు వేసి ఎన్నుకుంటే మేలు కలుగుతుంది. ఆడపిల్లలకు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. చేతి నిండా పని ఉంటుంది.. గీ దుబాయి.. ముంబయి వలసలు ఉండవు.. మంచి చేసే నేతలను ఎన్నుకుంటే మీ తల రాతలు మారుతాయి..పిల్లినని చులకనగా చూడకండి.. నేను చెప్పే మాటలను ఒక్కసారి ఆలోచించండంటూ... మ్యావ్.. మ్యావ్.. అంటూ పిల్లి మెల్లగా ట్యాంకు మెట్లు దిగి పక్కింట్లో దూరింది. గుమిగూడిన జనం ఎవరిదారిన వారు వెళ్తూ.. పిల్లి చెప్పిన మాటలను ఆలోచిస్తున్నారు.

పైసా పోకుండా పట్టేశారు

- దొంగతనం కేసులో ఇద్దరి అరెస్ట్
- రూ.2.30 లక్షల నగదు రికవరీ
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: బ్యాంకులో డబ్బులు డిపాజిట్ చేయడానికి వచ్చిన వ్యక్తిని గమనించి మాటువేసి దొంగతనానికి పాల్పడిన జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌కు చెందిన కవ్వంపెల్లి హరీశ్, శాప అరవింద్‌ను సిరిసిల్ల పోలీసులు రిమాండ్‌కు పంపారు. దొంగలించిన రూ.2.30 లక్షల సొత్తులో ఒక్క పైసా పోకుండా రికవరీ చేసి బాధితునికి న్యాయం చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. బుధవారం వివరాలు వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన సిలుముల రాజనర్సు ఈనెల 7న సిరిసిల్లలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో తన వద్ద ఉన్న సొమ్మును డిపాజిట్ చేసేందుకు వెళ్లాడు. నగదు జమచేసే క్రమంలో రూ.2.30 లక్షలకు బదులుగా ఓచర్‌లో 2.50 లక్షలు రాశాడు. దీన్ని గమనించిన బ్యాంకు సిబ్బంది డిపాజిట్ స్లిప్‌లో రాసినంత వేయడానికి మరో రూ.20 వేలు కావాలనడంతో మిగతా సొమ్మును ఇంటికెళ్లి తెస్తానని బయటకు వచ్చాడు. ఇంటికెళ్తుండగా నజరాజ్ థియేటర్ ప్రాంతానికి చేరుకోగానే ఇద్దరు బైక్‌పై వచ్చి రాజనర్సు చేతిలోని సంచిని లాకెళ్లారు. వెంటనే బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్, క్రైమ్ టీం సిబ్బంది పుల్కం శ్రీనివాస్, గోపాల్, నాగరాజు, సీసీఎస్ సీఐ రవీందర్, సిబ్బంది అక్బర్, తిరుపతి దర్యాప్తు ప్రారంభించారు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తుల వివరాలను తమకున్న సమాచారంతో కనిపెట్టి స్థానిక సుభాష్‌నగర్ ట్యాంకు వద్ద అదుపులోకి తీసుకున్నారు. దొంగలించిన రూ.2.30 లక్షలు, దొంగతనానికి ఉపయోగించిన బైక్‌ను సీజ్‌చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సీఐ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆఫీస్ ముందు నిరసన



నిరసన తెలుపుతున్న జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, నేతలు

వేములవాడ: బీజేపీ వేములవాడ అసెంబ్లీ టికెట్ తుల ఉమకు కేటాయించడంపై ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ రాష్ట్ర పార్టీ ఆఫీస్ ముందు బుధవారం నిరసన తెలిపారు. ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ పార్టీ టికెట్ చెన్నమనేని వికాస్‌రావుకు కేటాయించే వరకు కదిలేదిలేదంటూ భీష్మించుకుని కూర్చున్నారు. పార్టీ పట్టణాధ్యక్షుడు, కౌన్సిలర్ రేగుల సంతోష్‌బాబు, పలు మండలాల అధ్యక్షులు ముంజం శ్రీనివాస్‌గౌడ్, జక్కుల తిరుపతి, గొట్టె రామచంద్రం, పొంచెట్టి రాకేశ్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు నంద్యాడపు వెంకటేశ్, కోల కృష్ణస్వామి, బుర్ర శేఖర్‌గౌడ్, సిరికొండ శ్రీనివాస్, గోపాడి సురేందర్‌రావు, సర్పంచులు జగన్, అన్నాడి జలపతిరెడ్డి, ఉపసర్పంచ్ తిరుపతి, పిన్నింటి హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.

లక్ష మందికి ఉపాధి బాటలు

- ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

సిరిసిల్ల/ఎల్లారెడ్డిపేట: రాష్ట్రంలో లక్ష మంది ఉపాధికి బాటలు వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 102 జారీ చేసిందని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య పేర్కొన్నారు. సిరిసిల్లలోని బీఆర్ఎస్ భవన్‌లో, ఎల్లారెడ్డిపేటల్లో బుధవారం నిర్వహించిన సమావేశాల్లో ప్రభుత్వం రజకుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు ఆవిష్కరించారు. రాజకీయంతో పాటు ఆర్థికంగా ఎదుగుదల ఉన్నప్పుడే అందరూ గుర్తిస్తారన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రజక సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రమేశ్, మాజీ కౌన్సిలర్ పద్మ, పట్టణ అధ్యక్షుడు దండు శ్రీనివాస్, కార్యదర్శి కాసర్ల మహేందర్, రజక సంఘం నాయకులు లింగంపల్లి దేవయ్య, రాము, శ్రీనివాస్, విక్రమ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలమల్లు, నాయకులు పర్శరాములు, కృష్ణహరి, కిష్టయ్య, రాములు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలో వీడియో చిత్రీకరణపై కేసు

గోదావరిఖని: ఖని మెడికల్ కళాశాలలో ఓపార్టీకి అనుకూలంగా వీడియో చిత్రీకరణపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు బుధవారం రాత్రి తెలిపారు. చిత్రీకరణ అంశంపై ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేయడంతో సీరియస్‌గా తీసుకున్నారు. ఎన్నికల అధికారులు కళాశాలకు చేరుకుని ఇప్పటికే విచారణ జరిపారు. కాంట్రాక్టు శానిటేషన్ సూపర్‌వైజర్, సెక్యూరిటీ సిబ్బందిని విధుల్లోంచి తొలగించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. కొందరు వ్యక్తులు ప్రిన్సిపాల్ అనుమతిలేకుండా ఎలక్షన్ కోడ్ నిబంధనలకు విరుద్ధంగా వేరే వ్యక్తులను తీసుకొచ్చి ఓ పార్టీకి అనుకూలంగా వీడియో చిత్రీకరించారని, సోషల్ మీడియాలో పోస్టు చేశారని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి శివారు చందపల్లికి చెందిన రాజం సంతోష్ (32) బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. సంతోష్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బుధవారం పురుగుల మందు తాగగా గమనించిన స్థానికులు ప్రాథమిక చికిత్స చేయించి కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు. భార్య దేవ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొలనూర్, గోపరపల్లె, నాంసానిపల్లె గ్రామాల్లో ఎస్సై సూతి శ్రీధర్ ఆధ్వర్యంలో బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలన్నారు.

జోరుగా ఫిరాయింపులు

- రోజుకో కండువా..
- టికెట్‌ల వ్యవహారంతో ఆశావహుల పరేషాన్
- జోరుగా బేరసారాలు

వేములవాడ: వేములవాడలో ఎన్నికల చిత్రాలు రోజుకోతీరుగా ఉంటున్నాయి. బీఆర్ఎస్, బీజేపీ టికెట్ల వ్యవహారం వివాదాస్పదంగా మారాయి. బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబును కాదని చల్మెడ లక్ష్మీనరసింహారావుకు టికెట్ ఇవ్వడం.. బీజేపీలో తుల ఉమకు కేటాయిస్తూ ప్రకటన వెలువడడంతో రెండు పార్టీలోనూ టికెట్ ఆశావహులు అసంతృప్తి గళం అందుకున్నారు. ఆయా పార్టీల అధిష్ఠానాలు తీసుకుంటున్న నిర్ణయాలతో నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు పార్టీల కండువాలు మార్చేస్తున్నారు.

జోరుగా బేరసారాలు

వేములవాడ అసెంబ్లీ స్థానం నుంచి ఆయా పార్టీల అభ్యర్థులు తమ ప్రచారం కొనసాగిస్తుండగా.. కొద్ది రోజులుగా అసంతృప్తిలో ఉన్న చోటామోటా నాయకులు పార్టీ ఫిరాయింపులు కొనసాగిస్తున్నారు. రెండు రోజులుగా పార్టీ మార్పులు జోరందుకున్నాయి. సముచిత స్థానం దక్కడం లేదని, తమ అభిమాన నాయకుడికి టికెట్ రాలేదన్న సాకులతో ఇతర పార్టీల్లోకి జంప్ అవుతున్నారు.

ఊపందుకున్న బీసీ నినాదం

వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గంగా అవతరించినప్పటి నుంచి రమేశ్‌బాబు నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన ప్రత్యర్థి ఆది శ్రీనివాస్ నాలుగుసార్లు ఓడిపోయారు. నిన్నమొన్నటి వ రకు బీజేపీ నుంచి చెన్నమనేని వికాస్ రావుకు టికెట్ వస్తుందని భావించారు. అధిష్ఠానం నిర్ణయంతో ఆయన అనుచరులతోపాటు టికెట్ ఆశావహులైన ప్రతాప రామకృష్ణ నిరాశకు లోనయ్యారు. హైదరాబాద్‌లో ఆఫీస్ ఎదుట నిరసన సైతం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

చందుర్తి(వేములవాడ): మండలంలోని మర్రిగడ్డ గ్రామశివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన చెట్‌పల్లి శ్రీనివాస్ తన కూతురు, కుమారుడితో కలిసి సిరిసిల్ల పట్టణంలోని తన బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి వెళ్లాడు. తిరిగి వస్తుండగా మర్రిగడ్డ గ్రామశివారులోకి రాగానే పెట్రోల్ బంకు సమీపంలో వెనుక నుంచి వచ్చిన ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ముగ్గురిని చికిత్స నిమిత్తం స్థానికులు వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మా ఓట్లు కావాలి.. సమస్యలు పట్టించుకోరా

- పల్లెగుట్ట భూనిర్వాసితులు
- నామినేషన్ దాఖలు



నామినేషన్ వేసేందుకు బయలుదేరిన నిర్వాసితులు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి గ్రామ పల్లెగుట్ట భూనిర్వాసితులు కలిసి నిర్వాసితుడైన మహ్మద్ నజీర్‌తో నామినేషన్ దాఖలు చేయించారు. ఈమేరకు బుధవారం బయలుదేరారు. వారు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం 1992లో నాంపల్లిలోని 50 నిరుపేద కుటుంబాలకు 140 ఎకరాలు పల్లెగుట్ట వద్ద ప్రభుత్వం పట్టాలు అందించిందని తెలిపారు. తొమ్మిదేళ్ల క్రితం ఆ భూమిని ప్రభుత్వం తీసుకుందని.. అప్పటి నుంచి తమను ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఆ భూమిని అందించాలని కోరుతూ వేములవాడకు ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. నిర్వాసితులు వేల్పుల రాజు, పర్శరాములు, సంగెపు శ్రీనివాస్, లచ్చయ్య, మహ్మద్ ముజాఫర్, కనకయ్య, బదుగు శంకర్, నర్సయ్య, శంకర్, పోచంపల్లి అనిల్, శివరాత్రి దేవయ్య, అరవింద్, ఎండీ సలీమాబీ, లచ్చవ్వ, రామవ్వ, దేవవ్వ ఉన్నారు.

చింతకాయలు తెంపుతూ..

- చెట్టు కొమ్మల మధ్య ఇరుక్కొని వ్యక్తి మృతి



చెట్ల కొమ్మల మధ్య బాలనర్సు మృతదేహం

సిరిసిల్లటౌన్: చింతకాయలు తెంపుతూ చెట్టు కొమ్మల మధ్య ఇరుక్కొని ఓ వ్యవసాయ కూలీ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పదేళ్ల క్రితం ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది నుంచి వచ్చిన నిమ్మల బాలనర్సు (44) భార్య మాధవి, కూతురు లహరి (14)తో కలిసి సిరిసిల్ల పరిధిలోని జగ్గారావుపల్లెలో ఉంటున్నాడు. భార్యాభర్తలు వ్యవసాయ కూలీ పనులు చేస్తున్నారు. బుధవారం సిరిసిల్ల మార్కెట్‌లో నిమ్మకాయలు విక్రయించి ఇంటికి వెళ్లే క్రమంలో బాలనర్సు గ్రామ శివారులోని చింతచెట్టు ఎక్కాడు. చింతకాయలు తెంపి చెట్టు దిగే క్రమంలో ప్రమాదవశాత్తు జారి కొమ్మల మధ్య ఇరుకున్నాడు. ఈ క్రమంలో లుంగీ గొంతుకు బిగించుకుపోగా చెట్టుపైనే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు.

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య



నితిన్ (ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని గూడెం గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గూడెంకు చెందిన గడ్డల బాలయ్య, దేవవ్వ దంపతుల కుమారుడు నితిన్ ఐదు రోజుల క్రితం ఇంట్లోంచి వెళ్లాడు. తల్లిదండ్రులు బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఆచూకీ కోసం గాలించినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం రాత్రి గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకొని కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న నితిన్ తల్లిదండ్రులకు ఒక్కాగానొక్క కుమారుడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. సంఘటన స్థలాన్ని ఎస్సై పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

ఉరేసుకొని యువకుడు..



వెంకటేశ్ (ఫైల్)

వేములవాడరూరల్: మండలంలోని మల్లారం గ్రామం రాజానగర్‌కు చెందిన గొర్రె వెంకటేశ్ (35) కుటుంబ కలహాలతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై మారుతి తెలిపిన తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్ పదేళ్ల క్రితం జగిత్యాల జిల్లా పొలాసకు చెందిన యువతిని ప్రేమవివాహం చేసుకున్నాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య విభేదాలు రావడంతో ఆమె జగిత్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెందిన వెంకటేశ్ బుధవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



ఆపరేషన్ బ్యూటీ

పెళ్లి సంబంధాల్లో 'కొత్త' డిమాండ్

పెళ్లి సంబంధం కుదరగానే వారి వారి స్థోమత మేరకు పెళ్లి ఎంత గ్రాండ్‌గా చేయాలనే ఆలోచన చేస్తుంటారు పెద్దవాళ్లు. పెళ్లిలో కాబోయే అత్తగారి డిమాండ్ మేరకు వధువు అమ్మానాన్నలు నడుచుకుంటూ ఉంటారు. ఇందులో భాగంగా ఇటీవల మరో కొత్త డిమాండ్ కూడా వచ్చి చేరింది. కాబోయే పెళ్లికూతురు వివాహ వేడుకలో దేదీప్యమానంగా వెలిగిపోవాలి. అందరూ 'అందమైన కోడలిని సెలెక్ట్ చేసుకున్నారు అనే కితాబులు అందుకోవాలి. అందుకు, ఏ చికిత్స చేయించుకున్నా సరే!' అంటున్నారు. మరి, కాబోయే వధువులు వేడుకకు సిద్ధం కావడానికి ఎలాంటి కేర్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో అందం పట్ల తీసుకుంటున్న చికిత్సలు.. వికటిస్తున్న పరిమాణాలు ఏమిటి? భేష్ అనదగిన విధానాలేమిటి? అనే విషయాలపై తప్పనిసరిగా దృష్టి పెట్టాలి.

''ఓ మల్టీనేషనల్ కంపెనీలో పనిచేస్తున్న సుష్మ పెళ్లి వచ్చే డిసెంబర్‌లో జరగనుంది. పెళ్లి ఫిక్స్ అయ్యాక అత్తగారు నవ్వుతూ – 'అమ్మాయీ, నీ వంటి రంగు బ్రైట్ చేయించుకో. ఫెయిర్ నెస్ కోసం ఇంజెక్షన్లు మార్కెట్‌లో దొరుకుతాయని విన్నాను. వాటిని ట్రై చేయి. ఏ ట్రీట్‌మెంట్ అయినా తీసుకో. కానీ, పెళ్లి టైమ్‌కి అందంగా తయారవ్వాలి' అని ఆర్డర్ వేసింది. ఆమె తన కోడలు పందిట్లో చందమామలా కనిపించాలని, కోడలు మొహం చూసి బంధుమిత్రులంతా నిశ్చేష్టులవ్వాలని కోరుకుంటుంది. 'అత్తగారి డిమాండ్ ఇప్పుడు నాకు ఆందోళన కలిగిస్తోంది' అంటోంది సుష్మ. ఇందుకోసం బ్యూటీ ట్రీట్‌మెంట్స్‌తో పాటు చర్మ ఛాయలో కూడా తేడా వచ్చేలా మార్పులు చేసుకోవడానికి తెగ కష్టపడుతోంది. 'పెళ్లి అంటేనే ఎంతో ఉత్సాహం. ఫొటోల్లో, వీడియోల్లో బాగా కనిపించాలని, అందరిలో ప్రత్యేకంగా వెలిగిపోవాలని నాకూ ఉంటుంది. ఇందుకు బ్యూటీ పార్లర్స్‌కి వెళ్లడం, మేకప్ చేయించుకోవడం సాధారణంగా జరుగుతుంటుంది. కానీ, ఇప్పుడు ప్రత్యేకంగా ట్రీట్‌మెంట్స్ కూడా చేయించుకోవాల్సి వస్తోంది. పెళ్లి ఖర్చులే కాకుండా ఈ కొత్త తరహా ఖరీదైన ఖర్చు తలనొప్పిగా మారింది అంటున్నారు అమ్మనాన్నలు' అని బాధపడుతోంది సుష్మ.

★ ★ ★

కాబోయే అత్తగారు కోరడంతో రూప (పేరు మార్చడమైంది) తన కంటి కింది భాగం లోతుగా ఉండటం వల్ల 'అండర్ ఐ ఫిల్లర్' ఇంజక్షన్ చేయించుకుంది. దీంతో కంటి కింది భాగంలో రక్తం గడ్డకట్టి, వాపు వచ్చి, బయటకు రాలేని పరిస్థితి. త్వరలో పెళ్లి. ఆ క్లాట్ అంత తొందరగా తగ్గదు. దిక్కుతోచని పరిస్థితి.

★ ★ ★

శిల్ప అందం కోసం బొటాక్స్ ట్రీట్‌మెంట్ చేయించుకుంది. డోస్ ఎక్కువ మోతాదులో ఇవ్వడం వల్ల ముఖంలో ఎక్స్‌ప్రెషన్స్ ఇవ్వడానికి వీలు లేకుండా మారిపోయింది.

★ ★ ★

అందం పెంచుకునే విషయంలో ఒకరో ఇద్దరు కాదు అమ్మాయిలు ఎప్పుడూ తమ ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. ఇక పెళ్లి అంటే చెప్పనక్కర్లేదు. ప్రీ వెడ్డింగ్ షూట్ నుంచి ప్రతి సంబరాన్నీ పదిలపరుచుకోవడానికి ఎన్నో పాట్లు పడతారు. దీంట్లో భాగంగా బ్యూటీ కాన్షియస్ అమ్మాయిల్లోనూ, అబ్బాయిల్లోనూ పెరిగింది. ఈ విషయంలో ఎలాంటి చికిత్స, జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకోవడం మంచిది అంటున్నారు డెర్మటాలజిస్ట్ డాక్టర్ స్వప్న ప్రియ. వాటిలో...

ఇంట్లో ప్రయోగాలు..

చాలా మంది అందానికి ఇంటి చిట్కాలు పాటిస్తుంటారు. సహజంగా లభించే వాటితో బ్యూటీప్యాక్‌లు వేసుకుంటూ ఉంటారు. వాటి ద్వారా ఎంత సమయంలో ఎంత ప్రయోజనం ఉంటుందో కూడా చూడాలి. ఎందుకంటే, కొంతమందికి స్కార్స్, పింపుల్స్, యాక్నె, డల్ స్కిన్, కలర్ ఛేంజ్, చుండ్రు... ఇలా చాలా సమస్యలు ఎదుర్కొంటూ ఉంటారు. వాటికి చికిత్సనే సరైన మార్గం. ఆహారానికి సంబంధించినవి తప్పనిసరిగా పెళ్లికి రెండు నుంచి మూడు నెలల ముందు మార్పులు చేసుకోవాలి. సహజంగా చర్మంలో మార్పులు రావాలంటే పోషకాహారం మంచి ఎంపిక. అప్పుడే మంచి ఫలితం ఉంటుంది.

బ్యూటీ స్పాలో చికిత్స మంచిదేనా?

స్కిన్ టైటనింగ్, రింకిల్స్, స్కిన్ హైడ్రేషన్.. వంటి ట్రీట్‌మెంట్స్ బ్యూటీ స్పాలలో చేయించుకుంటారు. దీనికి కూడా ముందు సరైన కౌన్సెలింగ్ అవసరం. ఒక్కో వ్యక్తి చర్మ తత్వం ఒక్కో విధంగా ఉంటుంది. ఈ విధానంలో చర్మం రికవరీ అవడానికి కూడా సమయం పడుతుంది.

ఇంజక్షన్లు సరైనవేనా...

కృత్రిమంగా కొలాజన్, స్కిన్ బూస్టర్స్.. అని తీసుకుంటున్నారు. ఎవరో చెప్పారని కొంతమంది నర్సులను ఇంటికి పిలిపించుకొని ఇంజక్షన్లు చేయించుకుంటారు. మంచి లుక్ కోసం ట్రై చేయచ్చు. కానీ, వాటి డోసుల్లో తేడాలొస్తే మొత్తం తిరగబడుతుంది.

ఆన్‌లైన్‌లో చూసి ...

సోషల్ మీడియా ప్రభావం వల్ల ఆన్‌లైన్‌లో బ్యూటీ ఉత్పత్తులు తెప్పించుకొని, అప్లై చేసుకోవడం చూస్తుంటాం. వాటి వల్ల ఇబ్బందుల పాలైన వారు చాలా మంది ఉంటారు. ఎందుకంటే, అవి వారికి ఎంత వరకు నప్పుతాయో తెలియదు.

కెమికల్ పీలింగ్

కెమికల్ పీల్‌లో బయటి నుంచి చర్మంలోకి ఎలాంటి రసాయనాలు చొప్పించరు. మృతకణాలను తొలగిస్తారు, చర్మం పై పొర నుండి టానింగ్, పిగ్మెంటేషన్ తగ్గి కొత్త పొర కనిపిస్తుంది. అయితే, దీని ద్వారా చర్మంపై కొత్త సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. నిపుణుల సలహా అవసరం. ఇంకొన్ని పీఆర్‌పీ చికిత్సలు చర్మ నిగారింపును తీసుకువస్తాయి. అయితే, వధువులు కాబోయే అమ్మాయిలు పెళ్లికి 3 నుండి 6 నెలల ముందు ఈ కాస్మెటిక్ విధానాలను ప్రారంభించాలి. ఎందుకంటే వారి సిట్టింగ్‌లలో కనీసం 3 వారాల గ్యాప్ ఉండాలి.

లైటర్ టోన్‌లకు డిమాండ్

పెళ్లి చేసుకోబోయే అమ్మాయిలు తమ ప్రీ-బ్రైడల్ విధానంలో రంగు ఫెయిర్‌గా మారడం పట్ల ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. నిజానికి, సూర్యకిరణాల నుండి మన చర్మాన్ని మనం రక్షించుకోనప్పుడు, చర్మంలో పాచెస్ ఏర్పడతాయి. కొన్నిసార్లు సూర్యకాంతి కుడి వైపున, మరి కొన్నిసార్లు ఎడమ వైపున ఎక్కువగా పడుతుంది. సూర్యుని అతినీలలోహిత కిరణాలు చర్మ కణాలను దెబ్బతీస్తాయి. పిగ్మెంటేషన్‌ను ప్రేరేపిస్తాయి. దీంతో అంతటా 'చర్మపు రంగు' ఒకే విధంగా ఉండదు. అంటే ముఖం మీద చాలా చోట్ల టాన్ ఉంటుంది. ఈవెన్ టోన్‌ని కలిగి ఉండాలంటే ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు ముఖంపై సన్‌స్క్రీన్‌ని అప్లై చేయడం చాలా ముఖ్యం.

కాస్మెటిక్ ఫిల్లర్స్...

నిఖిత పెదవులు చాలా సన్నగా ఉంటాయి. రంగు చాలా తక్కువ. ఒకరోజు ఆమె కాబోయే అత్తగారు ఫోన్ చేసి 'నీ ముఖంలో పెదవులు కనిపించడం లేదు. ఏదైనా చికిత్స తీసుకో' అంది. దీంతో నిఖిత నర్సులను కాస్మెటిక్ ఫేషియల్ ఫిల్లర్లను ఆశ్రయించింది. దీనిని లిప్ ఫిల్లర్ అని కూడా అంటారు. దీర్ఘకాలిక ఫలితాల కోసం, ప్రతి 6 నుండి 8 నెలలకు ఇంజెక్షన్లు చేయాలి. కాస్మెటిక్ ఫేషియల్ ఫిల్లర్లే కాకుండా, హైలురానిక్ యాసిడ్ ఫిల్లర్ ఇంజక్షన్లు కూడా ఈ రోజుల్లో బాగా ప్రాచుర్యం పొందాయి. ఈ డెర్మా ఫిల్లర్‌లతో పెదవులు హైడ్రేటెడ్‌గా ఉంటాయి. పగుళ్లు రావు, పూర్తి పరిమాణంలో కనిపిస్తాయి. అలాగే, కొందరు అమ్మాయిలు అత్తింటి వారు బరువు తగ్గమన్నారు కదా అని లైపోసక్షన్ వంటి చికిత్సలు చేయించుకుంటారు. దీని వల్ల చర్మంపై చారలు ఏర్పడతాయి. అవి అంత త్వరగా పోవు. ముక్కు, పెదాలు, బ్రెస్ట్ సరిచేసుకోవడానికి కాస్మాటిక్ సర్జరీలు కూడా చేయించుకుంటారు. ఏ చికిత్స అయినా కనీసం ఆరు నెలల ముందు చేయించుకుంటే వచ్చే సైడ్‌ఎఫెక్ట్‌నూ నివారించవచ్చు.

సహజమైన మెరుపే మేలు



డాక్టర్ స్వప్నప్రియ
సీనియర్ డర్మటాలజిస్ట్

పెళ్లి 10–15 రోజులు ఉందనగా ఏ బ్యూటీ ట్రీట్‌మెంట్ చేయించుకోకూడదనే విషయం ముందు గ్రహించాలి. కనీసం ఆరు లేదా మూడు నెలల ముందు బ్యూటీ చికిత్సలు చేయించుకోవచ్చు, దీని ద్వారా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటే నివారించుకునే అవకాశం ఉంటుంది. కృత్రిమ అందాన్ని ఎవరూ ఇష్టపడరు. ఎప్పుడైనా సహజమైన మెరుపును ఇచ్చే బ్యూటీ ట్రీట్‌మెంట్ మాత్రమే మంచిదని గమనించాలి. అయినా తప్పదు అనుకునేవారు స్కిన్ బూస్టర్స్, ఇతర ట్రీట్‌మెంట్ వైపుగా వెళ్లచ్చు. ఇందుకు నిపుణుల పర్యవేక్షణ అవసరం.

టిప్

డ్రై ఫ్రూట్స్ గిఫ్ట్ ఇస్తున్నారా?



దీపావళికి డ్రైఫ్రూట్స్‌ను గిఫ్ట్‌గా ఇస్తుంటారు చాలామంది. అయితే డ్రైఫ్రూట్స్‌ను కొనేటప్పుడు కచ్చితంగా ఇవి గమనించుకోవాలి. ● నట్స్ రంగు ఎలా ఉందో చూడాలి. సహజంగా ఉండాల్సిన దానికంటే మరింత ముదురు రంగులో ఉంటే అవి పాడైనట్టు. రుచిగా కూడా ఉండవు కాబట్టి కొనకపోవడమే మంచిది. ● వీలైతే ఒకటి రెండు నట్స్‌ను నీటిలో వేసి, పదినిమిషాల తరువాత కొరికి చూడాలి. నానిన తరువాత కూడా గట్టిగా ఉంటే అవి చాలా పాతవి. ఇవి ఆరోగ్యానికి అంత మంచిది కాదు కాబట్టి తీసుకోకూడదు. చాలా షాపులు తినడానికి శాంపిల్స్ ఇవ్వవు. ఇలాంటప్పుడు ఆ డ్రైఫ్రూట్స్‌ను తక్కువ పరిమాణంలో కొనుక్కుని పరిశీలించాలి ● నట్స్‌ని వాసన చూడాలి. ఘాటైన వాసన వస్తే అవి చాలా పాతవి. వీటికి కొద్దిగా తేమ తగిలితే వెంటనే బూజు పట్టి త్వరగా పాడవుతాయి. ఇవి తినడం ఆరోగ్యానికి మంచిది కాదు ● నట్స్ ప్యాకెట్ మీద ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ముద్ర, నిబంధనలకు అనుగుణంగా ఉందో లేదో చూడాలి. ఎప్పుడు ప్యాకింగ్ అయ్యింది? ఎప్పటిలోగా తినాలో సూచించే డేట్స్‌ను సరిగా చూసుకోవాలి. ఈ డేట్స్ ముద్రించని ప్యాకెట్స్‌ను కొనకూడదు ● ప్యాకెట్ మీద ముద్రించిన సమాచారాన్ని జాగ్రత్తగా చదవాలి. ప్రిజర్వేటివ్‌లు కలిపిన నట్స్‌ను కొనకపోవడమే మంచిది.

దుర్గ ఇండియా



ప్రతి స్త్రీ దుర్గ వలే...

ప్రతి స్త్రీలో ఒక దుర్గ ఉంటుంది. కాని ఆ దుర్గను అదిమి పెట్టేలా కుటుంబం, సమాజం ఆమెను తీర్చి దిద్దుతాయి. దాంతో తన మీద ఏ అన్యాయం జరిగినా చెప్పలేని స్థితికి చేరుతుంది. 'నువ్వు దుర్గవి. పోరాడు' అని చెప్తారు బెంగళూరులోని 'దుర్గ ఇండియా' టీమ్ సభ్యులు. ప్రియా వరదరాజన్ అనే యాక్టివిస్ట్ ఏర్పాటు చేసిన ఈ గ్రూప్ స్త్రీలను కుటుంబ హింస నుంచి... లైంగిక వేధింపుల నుంచి కాపాడటానికి పని చేస్తోంది. వారి పోరాటానికి శక్తినిస్తోంది.

'ప్రతి ఒక్కరూ మార్పు కోసం ఎదురు చూస్తారు. మనమే మార్పు కోసం ప్రయత్నిద్దామని ఎందుకు అనుకోరు... ఎదురు చూస్తూ కూచుంటే మార్పు వస్తుందా?' అంటారు ప్రియా వరదరాజన్.

బెంగళూరులో 'దుర్గ ఇండియా' అనే సంస్థ స్థాపించి స్త్రీల సమస్యలపై పని చేస్తున్న ప్రియ ఇటీవల బెంగళూరు మాల్‌లో ఒక వ్యక్తి స్త్రీలను అసభ్యంగా తాకడం గురించి ప్రస్తావిస్తూ 'పబ్లిక్ ప్లేసుల్లో– బహిరంగ ప్రదేశాల్లో గాని ఆన్‌లైన్‌లోగాని స్త్రీల గౌరవ మర్యాదలకు భంగం కలిగిస్తే అలాంటి వారిపై చర్య తీసుకునేందుకు ఆ బాధిత మహిళకు అండగా నిలవడం మేము చేసే పని. చట్టాలు ఎన్ని ఉన్నా, పోలీసులు, మహిళా పోలీసులు ఎందరు ఉన్నా మహిళలకు సాటి మహిళ అండగా ఉంటే కలిగే ధైర్యం వేరు. తోటి మహిళలతో వారు చెప్పుకునేవి వేరు. అలాంటి వారికి యోగ్యులైన కౌన్సెలర్లతో కౌన్సెలింగ్ చేయించి దిలాసా ఇప్పిస్తాము. అంతే కాదు బాధితులను వెంటబెట్టుకొని– ఆ స్టేషన్‌కుపో ఈ స్టేషన్‌కు పో అనే బాధ లేకుండా బెంగళూరులో వన్ స్టాప్ సెంటర్స్‌లో ఫిర్యాదు చేయిస్తాము. తోడుగా మేమొస్తే బాధితులు ఫిర్యాదు చేయడానికి జంకరు. ఎటొచ్చీ వారికి తోడు నిలిచే స్త్రీల బృందాలు అన్నిచోట్లా ఉండాలి' అంటుంది ప్రియ.

ఐ యామ్ ఎవ్రి ఉమన్

పదేళ్ల క్రితం ప్రియా వరదరాజన్ 'ఐ యామ్ ఎవ్రి ఉమన్' పేరుతో ఒక బ్లాగ్ రాయడం మార్పు కోసం ఆమె వేసిన మొదటి అడుగు. ఆ బ్లాగ్‌కు క్రమంగా చాలామంది మహిళా ఫాలోయర్లు వచ్చారు. వారు తమ అనుభవాలను ప్రియతో పంచుకోసాగారు. 'అందరిదీ ఒకే కథ. అందరూ మరొక స్త్రీ లాంటి వారే అని నాకు అర్థమైంది. స్త్రీల కోసం పని చేయాల్సిన అవసరం తెలియజేసింది. స్త్రీల కోసం పని చేయడం అంటే వారి పట్ల భావజాలాన్ని మార్చడమే' అంటుంది ప్రియ.

మగాడు ఎందుకు అలా చేస్తాడు?

'గతంలో సమాజంలో స్త్రీలకు ఏదైనా సమస్య వచ్చి ఆమె బయటకు చెప్పినప్పుడు– ఆమెలో ఏ దోషం ఉందో అన్నట్టుగా నిందను ఆమె మీదే వేసేవారు ఉండేవారు. వారి భావజాలాన్ని మార్చడమే చేయవలసింది. స్త్రీకి ఏదైనా అన్యాయం జరిగినప్పుడు ఆ మగాడు ఆమెతో అలా ఎందుకు చేశాడు అని ఆలోచించేలా చేస్తే సగం మార్పు వచ్చినట్టే. ఇంట్లో, వీధిలో, ఆఫీసులో స్త్రీలు ఆత్మాభిమానంతో ఉండాలంటే మగాళ్లు మారాలి. అందుకు ఒక రోజు సరిపోదు. ఒకరు పని చేస్తే సరిపోదు. ప్రతి ఒక్కరం ఏదో ఒక మేరకు పని చేయాల్సిందే' అంటుంది ప్రియ.



అందరినీ 'దుర్గ'లుగా మారుస్తూ

అన్యాయం జరిగితే వెరవకుండా ప్రతిఘటించమని ప్రియ ఆధ్వర్యంలో 'దుర్గల' బృందం చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తోంది. స్కూళ్లలో, కాలేజీలలో, బస్తీలలో తిరుగుతూ స్త్రీలకు తమ హక్కులను, చట్టపరమైన రక్షణను, సహాయం చేసే బృందాలను తెలుపుతుంది. 'నేను ఒంటరిదాన్ని కాను అని స్త్రీ అనుకుంటే చాలు... ఆమె పోరాడగలదు' అంటుంది ప్రియ.

ఇంత ప్రయత్నం చేసే ప్రియ లాంటి వారి సంఖ్య ఎంత పెరిగితే దుర్గలకు అంత శక్తి పెరుగుతుంది.

ఖుషీతో దిల్ ఖుష్



చిన్నతనంలో తాము పడ్డ కష్టాలు తమ పిల్లలు పడకూడదని వాలికి నొప్పి తెలియకుండా ఎంతో కష్టపడి పెంచుతారు తల్లిదండ్రులు. అయితే లక్నోకు చెందిన ఖుషీ అందుకు భిన్నం. తన తండ్రిలా మరెవరూ కష్టపడకూడదని తానే ఓ సామాజిక కార్యకర్తగా మారి సాటి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది ఖుషీ పాండే.

లక్నోకు చెందిన 23 ఏళ్ల ఖుషీ పాండే బాల్యం ఉన్నావ్ అనే ఊళ్లో గడిచింది. తన తండ్రి నుంచి చిన్ననాటి విషయాలను క్షుణ్ణంగా తెలుసుకుంది. ఖుషీ తండ్రికి బాగా చదువుకోవాలని ఉండేది. కానీ పెన్సిల్ కొనే స్థోమత కూడా లేదప్పుడు. ఈ విషయం తెలుసుకుని, నాన్నలా మరెవరూ చదువుకోసం ఇబ్బంది పడకూడదు అనుకుంది. నిరుపేదలకు సాయం చేయాలని చిన్నప్పుడే గట్టిగా నిర్ణయించుకుంది.

ఖుషీ పెద్దయ్యేసరికి నాన్న వాళ్ల లక్నోకి మకాం మార్చారు. అక్కడ ఓ షాపులో పనిచేస్తూ తరువాత కాంట్రాక్టర్‌గా మారారు. ప్రభుత్వానికి సంబంధించిన ప్రాజెక్టులు కూడా రావడంతో ఖుషీ కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయి. దీంతో ఖుషీ 'లా' పూర్తయ్యాక, సోషల్ వర్క్‌లో పీజీ చేసింది. చదువు పూర్తయ్యాక వెంటనే నిరుపేదలకు చదువు చెప్పడం ప్రారంభించింది. మురికివాడల్లోని పిల్లలను ఒక చెట్టుకింద కూర్చోబెట్టి సాయంత్రం రెండుమూడు గంటలు చదువు చెప్పేది. రోజుకి యాభై మంది వరకు ఖుషీ క్లాసులకు హాజరయ్యేవారు. తన దగ్గరకు వచ్చే పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడంతోపాటు, వారి తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యతను వివరిస్తోంది.

తాతయ్య మరణంతో...

అది 2020 ... ఒకరోజు రాత్రి ఖుషీ వాళ్ల తాతయ్య షాపు నుంచి తిరిగి వస్తున్నారు. చీకట్లో సరిగా కనిపించక ఎదురుగా వచ్చే కారు తాతయ్య సైకిల్‌ని ఢీ కొట్టడంతో ఖుషీ తాతగారు అక్కడికక్కడే చనిపోయారు. తాతయ్యను ఎంతో ఇష్టపడే ఖుషీ ఈ చేదు సంఘటనను తట్టుకోలేకపోయింది. సైకిల్‌కు లైట్ ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదు అనుకుని ప్రతి సైకిల్‌కు లైటు ఉండాలని భావించింది. రోజూ కూలి పనిచేసుకునేవారు తమ సైకిళ్లకు లైట్లు పెట్టుకోవడానికి తగ్గ స్థోమత ఉండేది కాదు. దాంతో వాళ్లకు ఒక్కొక్కరికి 350 రూపాయల ఖరీదు చేసే లైట్లను ఉచితంగా పంచింది. ఇలా ఇప్పటిదాకా 1500 మంది వాహనాలకు బ్యాటరీతో నడిచే లైట్లను అమర్చింది. లైట్లు అమర్చడానికి 'ఇన్‌స్టాల్ లైట్స్ ఆన్ బైస్కిల్' అని రాసిన ఉన్న ప్లకార్డు పట్టుకుని వీధుల్లో తిరుగుతూ ఎంతోమందికి అవగాహన కల్పించింది. అప్పట్లో ఖుషీ చేసిన ఈ పనిని ఓ ఐఏఎస్ అధికారి వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో తెగ వైరల్ అయ్యింది. ఈ విషయం తెలిసిన ఎనభైమంది యువకులు ఖుషీతో కలిసి సైకిళ్లు, ట్రక్కులకు, ఇతర వాహనాలకు లైట్లు అమర్చడంలో ఖుషీకి సాయంగా నిలిచారు.





పాఠాలతో పైసలు సంపాదించి...

ఖుషీ చేస్తోన్న సామాజిక కార్యక్రమాలకు నిధులు చాలా కావాలి. ఇందుకు తన తండ్రి, బంధువులు సమకూర్చిన మొత్తం ఏమాత్రం సరిపోలేదు. దాంతో యూట్యూబ్‌లో 'లా' తరగతులు చెప్పడంతోపాటు, ఇతర పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తూ నెలకు అరవై నుంచి డెబ్బై వేల వరకు సంపాదించి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతోంది.

మహిళలకు అండగా...

బాలికలకు శానిటరీ ప్యాడ్ ల గురించి అవగాహన కల్పించడం, విద్యుత్ సదుపాయం లేని వారికి సోలర్ ల్యాంప్స్ అందించడం, 'జీవిక సాథీ' ప్రాజెక్టు పేరుతో దివ్యాంగ మహిళలు, వితంతువులు, ఒంటరి మహిళలకు కుట్టు మిషన్, జ్యూవెలరీ తయారీలో శిక్షణ ఇప్పించి వారి కాళ్ల మీద వాళ్లు నిలబడేలా చేయడం వంటి సేవా కార్యక్రమాలతో ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తోంది.

ఫస్ట్ టైమ్

మంత్రముగ్ధులను చేసే దాస్తాంగోయి



ఫౌజియా

'దాస్తాంగో ప్రదర్శన ఇస్తున్నది ఓ అమ్మాయా!!' అని బోలెడు ఆశ్చర్యపడుతూనే ప్రేక్షకుల మధ్య కూర్చున్నాడు ఒక ప్రేక్షకుడు. ఇలా కూర్చొని అలా వెళ్లిపోదాం... అనుకున్నాడు. అయితే ప్రదర్శన పూర్తయ్యే వరకు కదలకుండా కూర్చున్నాడు. ఆ హాల్‌లో నవ్వుల్లో నవ్వు అయ్యాడు. ఏడుపులో ఏడుపు అయ్యాడు. సకల భావోద్వేగాల సమ్మేళనంతో 'దాస్తాంగోయి' ఫౌజియాను ఆశీర్వదించాడు. ఉర్దూలో మౌఖిక కథాసాహిత్య కళారూపం... దాస్తాంగో. పురుషులకు మాత్రమే పరిమితమైన ఈ కళారూపంలో అపారమైన పేరు తెచ్చుకొని 'ఫస్ట్ ఫిమేల్ దస్తాంగోయి'గా గుర్తింపు పొందింది ఫౌజియా...

ఢిల్లీకి చెందిన ఫౌజియాకు స్కూల్ రోజుల నుంచి సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు అంటే ఇష్టం. స్కూల్లో ప్రదర్శించే నాటకాల్లో పాల్గొనేది. ఫౌజియా తండ్రి మోటర్‌బైక్ మెకానిక్. ఆర్థిక పరిస్థితి రీత్యా ఫౌజియా ఎప్పుడో చదువు మానేయాలి. ట్యూషన్‌లు చెప్పగా వచ్చిన డబ్బుతో పై చదువులు చదివింది. మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ చేసింది.

దయాల్ సింగ్ కాలేజీలో చదువుకునే రోజుల్లో ఒకరోజు తొలిసారిగా 'దాస్తాంగో' ప్రదర్శన చూసింది ఫౌజియా. ఇక అప్పటి నుంచి 'దాస్తాంగో'పై ఆసక్తి, అభిమానం పెరిగాయి. తాను కూడా 'దాస్తాంగోయి'గా పేరు తెచ్చుకోవాలనుకుంది. 'ఇది పురుషులకు మాత్రమే పరిమితమైన కళారూపం. మహిళలు చేయలేరు. ఒకవేళ చేసినా ప్రేక్షకులు ఆదరించరు' అన్నట్లుగా చాలామంది మాట్లాడారు.

ఆ మాటలు విని ఫౌజియా కొంచెం కూడా నిరాశపడలేదు. తనపై తనకు గట్టి నమ్మకం ఉంది.

'జీవితాంతం దాస్తాంగోచెంతనే ఉండాలనుకున్నాను. ఎంతో చరిత్ర ఉన్న ఈ కళ గురించి ఈ తరంలో కొద్ది మందికి మాత్రమే తెలుసు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈ తరానికి కూడా తెలిసేలా దాస్తాంగోకు ప్రాచుర్యం తీసుకురావాలనుకున్నాను' అంటుంది ఫౌజియా.

డానీష్ హుస్సేన్, మహ్మద్ ఫారూఖీ లాంటి గొప్ప కళాకారుల నుంచి 'దాస్తాంగో'ను నేర్చుకుంది ఫౌజియా. ఫౌజియా కథాసంవిధానంలో కృత్రిమమైన భాషా గాంభీర్యం వినిపించదు. పాత ఢిల్లీ యాస మాత్రమే వినిపిస్తుంది.

'మన దేశంలో ఎన్నో భాషలకు సంబంధించి ఎన్నో మాండలికాలు ఉన్నాయి. ప్రతి మాండలికానికి తనదైన సొగసు ఉంటుంది. ఈతరంలో చాలామంది తమ యాసను దాచి పెట్టే ప్రయత్నం చేస్తుంటారు. ఇది సరి కాదు. మన ఊరు, తల్లిదండ్రులు, సంస్కృతి గురించి గొప్పగా చెప్పుకున్నట్లే మన మాండలికం గురించి కూడా గొప్పగా చెప్పుకోవాలి' అంటుంది ఫౌజియా.

ఫౌజియాకు పుస్తకాలు చదవడం అంటే ఇష్టం. ముఖ్యంగా ఉర్దూ సాహిత్యం. చిన్నప్పుడు అమ్మ, అమ్మమ్మ, నానమ్మల నుంచి ఎన్నో కథలు విన్నది. అద్భుతమైన రీతిలో కథలు చెప్పేవారు. కథను ఎక్కడ మొదలు పెట్టాలి, ఎక్కడ విరామం ఇవ్వాలి, మళ్లీ ఎక్కడ మొదలు పెట్టాలి... అనే దాంట్లో వారు సిద్ధహస్తులు. ఆ మెళకువలు ఊరకే పోలేదు...'దాస్తాంగో'లో ఫౌజియాకు బాగా ఉపకరించాయి.

జానపద కథలు మాత్రమే కాకుండా సామాజిక సందేశం ఉన్న ఆధునిక కథలను కూడా చెబుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది ఫౌజియా. దేశవిభజన సమయంలో మహిళలు ఎదుర్కొన్న సమస్యలు, హింస గురించి కథగా చెబుతున్నప్పుడు ప్రేక్షకులు కదిలిపోయారు. కోవిడ్ కల్లోల సమయంలో ఫౌజియాకు 'దాస్తాంగో' ప్రదర్శనలు ఇవ్వడానికి కుదరలేదు. దీంతో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారానే ప్రదర్శన ఇచ్చింది.

అమ్మమ్మ, నానమ్మల నుంచి ఎన్నో కథలు విన్నది. అద్భుతమైన రీతిలో కథలు చెప్పేవారు. కథను ఎక్కడ మొదలు పెట్టాలి. ఎక్కడ విరామం ఇవ్వాలి. మళ్లీ ఎక్కడ మొదలు పెట్టాలి... అనే దాంట్లో వారు సిద్ధహస్తులు. ఆ మెళకువలు ఊరకే పోలేదు... 'దాస్తాంగో'లో ఫౌజియాకు బాగా ఉపకరించాయి.



మహాభారతం కథల నుంచి స్వాతంత్ర్యం కోసం మహాత్ముడి పోరాటం వరకు 'దాస్తాంగోయి'గా ప్రేక్షకులను మెప్పిస్తున్న ఫౌజియాకు ఉర్దూ భాషలోనే కాదు హిందీ, ఇతర భాషలలోనూ 'దాస్తాంగో' ప్రదర్శనలు ఇవ్వాలనేది కల. ఆమె కల నెరవేరాలని ఆశిద్దాం.